ఒక ఫోటో కథ

మా రఘు బాధపడలేక 'సరే' అన్నానే కానీ, నాకు వరహాలరావును కలుసుకోవడం ఏ మాత్రం ఇష్టం లేదు. అంతమాత్రంతో వరహాలరావు ఒకటోరకం హంతకుడో, పాపాత్ముడో, దగుల్బాజీయో అనుకునేరు. అలాంటిదేమీ లేదు. అతడొక మోస్తరు రచయిత.

ఒక మోస్తరు రచయిత అనడంలో నా ఉద్దేశ్యం ఏమిటంటే ఏదో రాస్తూ ఉంటాడంతే అని. మామూలు పాఠకులకు చక్కలిగింతలు పెట్టేవీ, భయభ్రాంతులకు లోనుచేసేవీ, వాస్తవ జీవితాన్ని మరపింపజేసి కలల్లో తేలియాడింపచేసేవీ రచనలు చేస్తూ వుంటాడు. ఒక ప్రయోజనం ఆశించిగానీ లేక పాఠకుణ్ణి ఆలోచింపజేద్దామనిగానీ, ఉత్తేజితుణ్ని చేద్దామనిగానీ అతడు ప్రయత్నించడు. ఆ మాట అతడు ఒప్పుకుంటాడుకూడా. "సామాజిక స్పృహ వంటి మాటలన్నీ రబ్బీష్!" అని పబ్లిగ్గానే అంటూ ఉంటాడు. అలాంటి రచయితలను ఎగతాళి చేస్తూ ఉంటాడు. తన ధోరణిలో చాలా రాశాడు. కూడా.

ఇంతకూ మా రఘు కోరిక ఏమిటో చెప్పలేదుకదూ! ఏమీ లేదు, రచయిత వరహాలరావును ఒక్కసారి దర్శించుకుని వీలైతే నాలుగు మాటలు మాట్లాడాలని, అంతకుమించి మరేమీ లేదు.

రఘు నాకు మేనల్లుడయినా మేమిద్దరం కొంచెం అటూఇటూగా సమ వయస్కులమనే చెప్పాలి. మహాఅయితే నేను రెండు మూడేళ్ల పెద్దవాణ్నేమో. పెళ్లికాగానే మా పెద్దవాళ్ల భాషలో వాడు దేశం కాని దేశానికి, అంటే మరేమిటో కాదు, ఎక్కడో ఉత్తరాదిన మరో రాష్ట్రానికి ఉద్యోగం నిమిత్తం వెళ్లిపోయాడు!' ఇటీవలేబదిలీ అయి ఇక్కడికొచ్చి 'హమ్మయ్య!మనవాళ్ల మధ్యకు వచ్చిపడ్డాము!' అనుకుంటున్నారు భార్యాభర్తలిద్దరూ. మా యింటికి దగ్గరలోనే ఇల్లు... తరచుగా రాకపోకలు....

"సరే"

'సరే' అన్న తర్వాత తప్పదు కాబట్టి మరుసటిరోజు సాయంకాలం వరహాలరావుకు ఫోను చేశాను. అదృష్టం బాగుండి దొరికాడు మహానుభావుడు.

"ఎన్నాళ్లకెన్నాళ్లకు! ఏమిటి సంగతులు?" అని అడిగాడు.

"ఏమీ లేదు, మీరు పేరున్న బిజీ రచయితలు కదా! మాటిమాటికీ దాడిచేసి మిమ్మల్ని బాధపెట్టడం ఎందుకని నా బాధ! అంతకంటే మరేమీ లేదు! ఇప్పుడు తప్పడం లేదు. మావాడొకడు వరుసకు మేనల్లుడు, నాయీడువాడే, ఇన్నేళ్లుగా ఎక్కడో ఉత్తరాదిలో ఉద్యోగంలో ఉండి ఉద్ధరించి ఇప్పుడిక దక్షిణాదిని ఉద్ధరించేందుకు ఇక్కడికి బదిలీ అయివచ్చాడు. మంచి పాఠకుడులెండి! మీ అభిమాని అనుకుంటాను. వాడికి మిమ్మల్ని చూడాలని అభిలాష!" అంటున్నాను.

"అయ్యో!దానికేం? నిక్షేపంగా రండి!" అన్నాడాయన.

"అయితే వొసున్నానిప్పుడే!" అని ఫోను పెట్టేశాను.

మావాడు హుషారుగా లేచాడు. ఇద్దరం రోడ్డుమీదకి వచ్చి ఆటోలో రచయితగారి ఇంటికి బయల్దేరాము. దోవపొడుగునా రఘు ఏదో వాగుతూనే ఉన్నాడు. బహుదూరం ఆ ఇల్లు. అరగంట పట్టింది. వెళ్లేసరికి ఆయన లోపల ఎక్కడో ఉన్నట్టున్నాడు. కాలింగ్‌బెల్ నొక్కి నిలబడ్డాము. లోపలినుంచి ఒక వృద్ధమహిళ కంఠస్వరం వినిపించింది సన్నగా-

"దేవుడా!నన్నెప్పుడు తీసుకుపోతావా అని ఏడుస్తున్నాను! అంటున్నారెవరో.

"అలాగే....! తొందరగా పోతే పీడ వదిలిపోతుంది!" అని మరో కంఠస్వరం స్పష్టంగానే వినిపించింది.

వరహాలరావు తలుపుతీసి నవ్వుతూ, "రండి రండి" అంటూ లోపలికి దారితీశాడు. ఒడ్డూ పొడుగూ మనిషి... ఒక కాలు కాస్త అవుటు. ఎత్తి ఎత్తి అడుగులు వేస్తున్నాడు.

"కూర్చోండి!" అని చెప్పి, అక్కడ మూలబల్లమీద ఉన్న ఒక పెద్ద ఫోటో ఆల్బమ్ తీసి మా ముందు టీపాయ్ మీద ఉంచి లోపలికి వెళ్లాడు.

చుట్టూ అలమారులలో చాలా పుస్తకాలు ఉన్నాయి. మావాడు ఆల్బమ్‌ను చేతిలోకి తీసుకుని తిరగవేయడం ప్రారంభించాడు. అందులో అన్నీ రచయితగారు ఉపన్యసిస్తున్న ఫోటోలు కొన్ని దండలతో నవ్వుతూ... రకరకాల సందర్భాల ఫోటోలు...

అంతలో లోపలనుంచి వరహాలరావు భార్య కాబోలు, బాగా ముస్తాబై హేండ్‌బాగ్ ఊపుకుంటూ విసురుగా వచ్చి, "వెళ్తున్నాను నేను!" అని పెద్దగా అంటూ బయటికి వెళ్లిపోయింది. వరహాలరావు లోపలినుంచి వచ్చాడు. ఇప్పుడు మనిషి ఫ్రెష్‌గా ఉన్నాడు. మా ముందు కూర్చుంటూ అనవసరంగా నవ్వాడు. నేను మా వాణ్ని పరిచయం చేశాను.

రఘు ఫోటో ఆల్బమ్ తిరగేస్తున్నవాడల్లా ఒకచోట ఆగి, నా వంక చూసి ఒక ఫోటో దగ్గర వేలుపెట్టి చూపించాడు. ఒక అందమైన యువతి ఫోటో అది...

వరహాలరావు అంతలో లేచి మా వెనక్కువచ్చి తానూ ఆ ఫోటో చూసి ఒకరకంగా నవ్వుతూ "ఆ ఫోటో..." అంటూ ఆగిపోయాడు. ఆ తర్వాత అతనిలో మార్పు వచ్చినట్టనిపించింది. ముందు నిట్టుర్చాడు తర్వాత అనవసరంగా కళ్లజోడు తీసి ముఖం తుడుచుకుని మళ్లీ తగిలించుకున్నాడు. మళ్లీ నిట్టూరుస్తూ కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమిటి విశేషం? అలా అయిపోయారేమిటి?" అని అడిగాను నేను.

"ఏం చెప్పను?" అని మొదలుపెట్టాడు.

"జీవితంలో ఒక్కొక్కప్పుడు ఏం పోగొట్టుకుంటామో తెలియదు. చాలా విలువైనవి మనవి కాకుండా పోతుంటాయి. మనం కోరుకోనివీ, ఇష్టపడనివీ వొచ్చి మీద పడుతూవుంటాయి!" అన్నాడు ముందుగా.

"రచయిత భాష మాట్లాడుతున్నారు!" అన్నాను నేను.

మావాడు ఉత్కంఠతో చూస్తూ వింటూ కూర్చున్నాడు.

వరహాలరావు మళ్లీ దీర్ఘంగా నిట్టూర్చాడు. ఆ తర్వాత ఎందుకో పైకి చూశాడు. ఆ పైన ఊరికే కళ్లు తుడుచుకుని అదొకరకంగా నీరసంగా "మీకు కాసిని కాఫీ ఇద్దామన్నా మా ఆవిడ ఇంట్లో లేకుండా పోయింది. చూడండి!" అన్నాడు.

నేను "ఫరవాలేదులెండి, కాఫీలు గట్రా అక్కర్లేదు! ముందు మీరు స్థిమితపడండి!" అన్నాను.

వరహాలరావు పారమార్థకపు నవ్వు ఒకటి విసిరి , "అంతే... జీవితం అంటే అంతే! ప్రతివాడూ ఏవో కలలు కంటాడు. చిన్నతనంలో అయితే వేరు. ఏదో కావాలని ఏడిస్తే పెద్దవాళ్లు కొని యిస్తారు. బూర కావాలన్నా, బూందీ కావాలన్నా, ఐస్‌క్రీమ్ కావాలన్నా ఏడిస్తే చాలు వొచ్చి పడతుందని అనుకుంటాం. కొంచెం గడిచాక తెలుస్తుంది అసలువిషయం - డబ్బుఅనే పదార్థం ఉందనీ, అదే అసలు సిసలు పదార్థమనీ అది లేకపోతే ఏమీ రాదనీ, అది లేకపోతే అంతా హుళక్కి అనీ తెలిసొస్తుంది. మనం ఏదో కావాలనుకుంటాము. కానీ మరేదో అయిపోతాము. నన్నే తీసుకోండి, నేను చిన్నప్పుడు డాక్టరు కావాలనుకున్నాను. కానీ బొత్తిగా వీల్లేకపోయింది. బి.ఎ. పూర్తిచేసి ఇలా గుమాస్తాగా మిగిలిపోయాను. ప్రేమించిన పిల్లను చేసుకోవాలనుకున్నాను. అస్సలు వీలులేకపోయింది. విధిగాడు చాలా క్రూరుడు. చిన్నచూపు చూశాడు!" అంటూ చెప్పుకుపోతున్నాడు.

"గుమాస్తా ఉద్యోగమైనా మీకేం తక్కువ? మంచి సీటు ....మీరు వద్దన్నా బలవంతం చేసి ప్రతివాళ్లూ ఏదో కొంత ముట్టచెపుతూనేవుంటారు కదా! మొన్నటికి మొన్న 'మా తమ్ముడి పని బాబూ, ఇది!' అని నేను వస్తే మీరు ఎంతో మంచి మనసుతో చేసిపెడితే మావాడు మీరు వద్దంటున్నా వినకుండా దాదాపు బలాత్కారం చేసి మీ జేబులో అయిదు వందల రూపాయల నోటు కుక్కడం గమనించలేదనుకున్నారా? మీరేమో 'ఎంత పనిచేశారండీ!' అని ఎంతగా నొచ్చుకున్నారు? అదీగాక చక్కగా ఆఫీసు నుంచి ఇంటికి రాగానే మాలాగా బలాదూర్లు తిరగకుండా ఎంతో ఓపికగా కాగితాలు ముందు వేసుకుని కూర్చుని కథలు, నవలలు పుష్కలంగా రాసి పారేస్తున్నారు. పత్రికలవాళ్లు ఊరికే వేసుకోరు కదా! వాళ్లూ గట్టి మొత్తాలే ఇస్తున్నారీ మధ్య! మీకేం తక్కువ?" అన్నాను నేను.

వరహాలరావు చేతులు నలుపుకుంటూ - "అదంతా వేరు స్వామీ! ఇవన్నీ ఆనందాన్ని ఇవ్వవు. మనం కోరుకున్నది లభిస్తే అదే అసలు సుఖం జీవితంలో అది లేకపోయిన తర్వాత జీవితంలో అంతా శూన్యమే కదా!" అన్నాడు.

"అది సరేలెండి. ఈ డబ్బు శాశ్వతం కాదు. నిజమే! ఆనందాన్నివ్వదు. అదీ నిజమే! మహామహా సామ్రాజ్యాలే పోయాయి! రాచరికాలే పోయాయి. ఇహ పేరూ, కీర్తి ప్రతిష్ఠలూ అంటారా! ఎవరూ వాల్మీకీ, కాళిదాసులూ కాజాలరుకదా! అది వొదిలెయ్యండి! ఈ ఫోటో గురించి చెప్పండి!" అన్నాను నేను వరహాలరావు ధోరణి మార్చే ప్రయత్నినం చేస్తూ.

వరహాలరావు కుర్చీలో వెనక్కు వాలి మొదలుపెట్టాడు, "మీకెప్పుడూ చెప్పలేదు...." అంటూ.

అవును. ఈ ఉదంతం అతడు నాకెప్పుడూ చెప్పలేదు. అసలు ఎవరికైనా చెప్పాడో, లేదో కూడా తెలియదు.

అది అతని కాలేజీరోజులనాటి సంగతి. బి.ఏ. చివరి సంవత్సరంలో ఉండగా అతడు ప్రేమలో పడ్డాడు. ఆ అమ్మాయి పేరు లలిత. అందగత్తె మాత్రమే కాదు, చదువుల సరస్వతి కూడా. బుద్ధిమంతురాలు. ఇంట్లో బయల్దేరేటప్పుడు వంచిన తల మళ్లీ పైకెత్తేది క్లాసురూములో లెక్చరరుగారి ముందే. అలాంటి లలితను మహాగాఢంగా ప్రేమించాడు వరహాలరావు. సరే, ప్రేమపొంగు ఎన్నాళ్లో అణిచివుంచలేడు కదా! ఏదో సమయంలో అది పైకి పొంగింది. ఆశ్చర్యం. ఏమిటంటే ఆ అమ్మాయి కూడా అతన్ని అంత గాఢంగా ప్రేమిస్తున్నదిట! ఇకనేం... ఇద్దరూ తమతమ పెద్దలకు చెప్పి ఒకటై జీవనయానం సాగిద్దామనుకున్నారుట. కులమూ, మతమూ, గోత్రమూ వగైరా బాధలు కూడా ఏమీ లేవు. ఏవీ అడ్డం రాలేదు. ఆ అమ్మాయి అన్నయ్య వీరి ప్రేమ విషయం ముందే కనుక్కుని 'మా చెల్లాయి ఎంత అదృష్టవంతురాలు! ఇంత అదృష్టవంతురాలు భూమ్మీద ఉండద'ని నిర్ణయించుకుని, మీకెందుకు? నేను మాట్లాడతాను పెద్దవాళ్లతో! కట్నాలు కానుకలు వగైరా ఏమీ అడ్డురాకుండా చూస్తాను!' అని పంచభూతాల సాక్షిగా పార్కులో శపథం కూడా చేశాట్ట.

ఇంతవరకు చెప్పి వరహాలరావు లేచి వెళ్లి తలుపుతీశాడు. అతని కూతురు అయివుంటుంది. ఒక ఆరేడేళ్ల నల్లని పిల్ల. ఆకుపచ్చ పసుపుపచ్చ బట్టల కాంబినేషన్‌తో చిత్రంగా బొమ్మలా కులుకుతూ "హాయ్ డాడ్!" అంటూ వరహాలరావుని పలకరించి లోపలికి వెళ్లింది. వరహాలరావు మళ్లీ కుర్చీలో కూర్చుని సెటిలై ఈ సారి కథ తొందరగానే ముగించాడు.

"అప్పుడు విధి మమ్మల్ని వంచించింది!" అని మొదలుపెట్టాడు. "దేవుడు క్రూరాతిక్రూరంగా మమ్మల్ని, అమాయకపు ప్రేమికుల జంటను ఏ నేరమూ లేకుండా శిక్షించాడు. మా ప్రేమను మంటకలిపాడు. లలిత కాన్సరు వ్యాధితో తీసుకుని తీసుకుని క్రుంగి కృశించిపోయి రెండు నెలలు వ్యవధిలో కళ్లుమూసింది."

నేను అదిరిపడ్డాను. గుండెల్లో ఎక్కడో కలుక్కుమన్నట్టయింది. ఆ ఫోటో కథ ఇలా దారుణంగా ముగుస్తుందని ఎవరు మాత్రం ఊహించగలరు చెప్పండి? వినరాని కథ ఏదో విన్నట్టు చదవరాని దారుణ వృత్తాంతం ఏదో చదివినట్టు అనిపించింది. సున్నితమైన కరుణరస సూత్రం తెగిపోయి, రసాభాస అయిన ఏదో వికృత రచన చదివినట్టు అనిపించింది.

"సారీ!" అని మాత్రం అన్నాను.

వరహాలరావు "నెవర్ మైండ్" అంటూ లోపలికి వెళ్లాడు.

రఘు మాత్రం అప్పటిదాకా కుర్చీలో కాళ్లు జాపుకుని కూర్చున్న వాడల్లా ఇప్పుడు సర్దుకుని కూర్చుని ఆ ఫోటో అల్బమ్‌ను పుస్తకాల రాక్‌లోకి నెట్టేశాడు.

నేను వాడివంక తిరిగి "చాలా బాధగా ఉందిరా!" అన్నాను. వాడేమీ మాట్లాడలేదు. వరహాలరావు అంతలో ట్రేలో గ్లాసులతో ఏదో డ్రింక్ తెచ్చి అందించాడు.

"మీ జీవితంలో ఇంత విషాదం దాగి ఉందని ఎన్నడూ అనుకోలేదు సుమండీ!" అన్నాను నేను.

వరహాలరావు విరక్తిగా నవ్వుతూ, ముందే చెప్పనుగా నేను, జీవితం అంటే అంతే! కోరుకున్నదేదీ అందదు అందినవేవీ బాగుండవు ! అన్నాడు.

"సరే!" అని లేచాను నేను 'మళ్లీ కలుద్దాం!" అంటూ కదిలాను. రఘు కూడా బయలుదేరాడు.

వరహాలరావు నమస్కారం చేసి "ఉంటాను!" అన్నాడు. చాలాదూరం నడిచాము నిశ్శబ్దంగా.

"మామయ్యా! ఆటో మాట్టాడనా? ఆ కథ విని చాలా నీరసపడినట్టున్నావు పాపం!" అన్నాడు వాడు.

"అలాగే!" అన్నాను నేను.

ఆటో వెళ్తున్నది. మావాడు అంతలో నన్ను మోచేత్తో పొడిచి "ఇటు చూడు!" అన్నాడు వాడి చేతిలోనే ఆ ఫోటో!

"నేను గాభారా పడుతూ "అరె! ఇదెందుకు తెచ్చావురా?" అని అరిచినంత పని చేశాను.

మావాడు నవ్వాడు "భయపడకు, భయపడకు!" అన్నాడు.

ఎందుకు తెచ్చానంటే ఇది నా భార్య.... అంటే అక్షరాలా నా సహధర్మచారిణి లత ఫోటో కాబట్టి! ఇది వరహాలరావు వంటి దగుల్బాజీ, మాయలమారి కథలు చెప్పేవాడి దగ్గర ఉండకూడదు కాబట్టి!"

"అంటే....?" అన్నాను నేను.

"నువు మా లతను పెళ్ళిలో సరిగా చూడలేదు. తర్వాత మేము ఎటెటో వెళ్ళిపోయాము. ఇన్నాళ్లకు ఇక్కడికొచ్చిపడ్డాము. లత పెళ్లియిన కొత్తలోనే చెప్పింది –తన పెళ్లి ఈ రచయితగాడితో జరిగి ఉండేదనీ, ఫోటో జాతకం వగైరాలు పంపమంటే పంపామనీ, కట్నం దగ్గర పేచీ వచ్చి వీళ్ళు వెనక్కి తగ్గిపోయారనీ, జాతకం ఒక్కటీ తిప్పిపంపి ఫోటో ఉంచేసుకున్నాడనీ వివరాలన్నీ చెప్పింది, ఈ ఫోటో ఆల్బమ్‌లో ఉంచుకుని వీడు అడగని వాడిది పాపమన్నట్టు చెప్పిన కథ చెప్పకుండా చెప్పుకొస్తున్నాడన్నమాట!" అన్నాడు రఘు.

నేను ఆశ్చర్యంతో తల్లకిందులైపోయాను "మరి అతగాడు ఎప్పుడైనా అడిగితే?"

"ఏముందీ? అసలు విషయం చెప్పేయ్! నోరు మూసుకుంటాడు. ఇప్పుడు చెప్పు. ఈ ఫోటో ఎక్కడుండాలి? వాడి ఆల్బమ్‌లోనా నా పర్సులోనా?" అని అడిగాడు మళ్లీ.

నేను నవ్వాను "నీ పర్సులోనే!" అన్నాను.

ఆటో సాగిపోతున్నది.

◆ ◆ ◆